RNI TELTEL2024/89323

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

**అందుకే, నా సినిమా టికెట్ ధరలు పెంచవద్దని చెబుతాను: విజయ్ దేవరకొండ** 8

నిజామాబాద్ | అక్టోబర్ 11 ఆదివారం 2026 | సంపుటి : 3 | సంచిక : 247 | పేజీలు : 8 | వెల రూ. 6.00/- | ఎడిటర్ : రాచమల్లు మాధవి

Nizamabad | SUNDAY OCTOBER 11 2026 | VOL:3 | ISSUE: 247 | PAGES:8 | Rs. 6:00 | EDITOR: Rachamallu Madhavi

# 'ఎంత మంది పోలీసులనైనా మోహరించుకోండి'.. ప్రధాని మోదీకి రాహుల్ సవాల్!

**ప్రధాని మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరిన రాహుల్ గాంధీ**

**అరెస్టులకు, నిర్బంధాలకు భయపడబోమని స్పష్టీకరణ**

**మోదీ, అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్‌ల లక్షణం పిరికితనం అని వ్యాఖ్య**

**సీఈసీ రాజీనామా కోరుతూ ఢిల్లీలో విపక్షాల నిరసనల నేపథ్యంలో వ్యాఖ్యలు**

**రాజ్యాంగాన్ని కాపాడటమే తమ లక్ష్యమని వెల్లడి**





ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ప్రభుత్వం ఎంతమంది పోలీసులనైనా మోహరించుకోవచ్చని, నేతలను, యువతను అరెస్టు చేసుకోవచ్చని, కానీ ప్రతిపక్షాల పోరాటం మాత్రం ఆగదని శనివారం స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. గత దశాబ్ద కాలంగా తాను మోదీ, ఆరెస్సెస్‌లపై పోరాడుతున్నానని, వారి గురించి తనకు పూర్తిగా తెలుసని రాహుల్ అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సహా పలువురి పేర్లను ప్రస్తావిస్తూ.. వారి ప్రధాన లక్షణం పిరికితనమని ఆరోపించారు. వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని, అందుకే వారు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. "మోదీ .. మీకు నచ్చింది చేసుకోండి. 10 వేలు, 20 వేలు, 50 వేల మంది పోలీసులను

(మిగతా 2వ పేజీలో..)

## ఢిల్లీలో 'అప్రకటిత ఎమర్-జెన్‌జీ': కేంద్రంపై శశి థరూర్ ఫైర్



**ఢిల్లీలో ఆంక్షలపై కేంద్రంపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఫైర్**

**సీజేపీ నిరసనను అడ్డుకునేందుకు యుద్ధ వాతావరణం సృష్టించారని ఆరోపణ**

**సమాధానాలు కావాలి.. లాఠీలు కాదని వ్యాఖ్య**

కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. శనివారం ఢిల్లీలో కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసనను అడ్డుకునేందుకు విధించిన కఠినమైన భద్రతా ఆంక్షలను ఆయన తప్పుబట్టారు. ఢిల్లీలో నెలకొన్న పరిస్థితులు 'అప్రకటిత ఎమర్-జెన్‌జీ'ని తలపిస్తున్నాయని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వ్యాఖ్యానించారు. తాను తెల్లవారుజామున 2 గంటలకు ఢిల్లీకి తిరిగి వచ్చానని, ఇలాంటి పరిస్థితులను

(మిగతా 2వ పేజీలో..)

## ఢిల్లీలో హై టెన్షన్.. మమతా, కేజ్రీవాల్ సహా పలువురు మాజీ సీఎంల అరెస్ట్



**ఢిల్లీలో నిరసనల ఉద్రిక్తత.. మమతా, కేజ్రీవాల్ అరెస్ట్**

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్షాల డిమాండ్**

**అనుమతి లేదంటూ నేతలను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు**

**కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌తో పాటు పలువురు ఎంపీల నిర్బంధం**

రాజధాని ఢిల్లీలో నేడు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ సహా పలువురు విపక్ష నేతలను కూడా

(మిగతా 2వ పేజీలో..)

## తెలంగాణలో ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు



**తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు**

**ఎంగిలి పూల బతుకమ్మతో మొదలైన తొమ్మిది రోజుల ఉత్సవాలు**

**సంప్రదాయ వస్త్రాల్లో మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలు**

**రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం భారీ ఏర్పాట్లు**

**హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై సద్దుల బతుకమ్మకు ప్రత్యేక ఏర్పాట్లు**

తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ ఉత్సవాలు శనివారం రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా

(మిగతా 2వ పేజీలో..)

## 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'.. ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్

**ఢిల్లీలో ఆంక్షలు విధించడంపై కాంగ్రెస్ అభ్యంతరం**

**యువత నిరసన హక్కును అడ్డుకుంటున్నారని ఆరోపణ**

**మోదీ, అమిత్ షాలపై ప్రియాంకా విమర్శలు**

**ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలన్న జైరాం రమేశ్**

**ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని కాంగ్రెస్ డిమాండ్**



ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చిన యువతను అదుపులోకి తీసుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే నిరసనలను అడ్డుకుంటున్నారని

(మిగతా 2వ పేజీలో..)

## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు: మంత్రి పొంగులేటి

**గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం 21 శాతానికి పైగా పెరిగిందన్న పొంగులేటి**

**ఇదే రేవంత్ రెడ్డి సమర్థ పాలనకు నిదర్శనమని వ్యాఖ్య**

**పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని భూ అక్రమాలను వెలికితీస్తున్నామని వెల్లడి**



తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై విశ్వాసం ఉంచారని

(మిగతా 2వ పేజీలో..)

## అరెస్ట్‌ను ముందే ఊహించి... వీడియో విడుదల చేసిన అభిజీత్ దీప్కే

**ఢిల్లీ విమానంలో కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ అభిజీత్ డిప్కే అరెస్ట్**

**జంతర్ మంతర్ నిరసనకు ముందే అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**అరెస్ట్‌ను ఊహించి ముందుగానే వీడియో రికార్డ్ చేసిన దీప్కే**

**తన తర్వాత నిరసనకు ఎవరు నాయకత్వం వహిస్తారో ప్రకటించిన వైనం**

**ఇది నియంతృత్వమంటూ పోలీసుల చర్యపై దీప్కే ఆగ్రహం**




దేశ రాజధాని ఢిల్లీలో నేడు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సహా ముగ్గురు నేతలను, వారు ప్రయాణిస్తున్న

(మిగతా 2వ పేజీలో..)

## హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

**భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి**



**ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి**

హైదరాబాద్ కేంద్రంగా

(మిగతా 2వ పేజీలో..)

## తమిళనాట ఆసక్తికరం... కాఫీ తాగుతూ కేఫ్‌లో రాహుల్ గాంధీ, సీఎం విజయ్ ముచ్చట్లు

**తమిళనాడు సీఎం విజయ్‌తో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భేటీ**

**విజయ్ నివాసంలో గంటపాటు సమావేశమై రాజకీయాలపై చర్చ**

**తమిళనాడులో కాంగ్రెస్-టీవీకే కూటమి నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యం**

తమిళనాడు రాజకీయాల్లో శనివారం ఓ ఆసక్తికరమైన సన్నివేశం ఆవిష్కృతమైంది. క్యాపిచినో, టిరమిసు, కుకీస్.. వీటికి రాజకీయ చర్చలు తోడైతే ఆ వాతావరణం



(మిగతా 2వ పేజీలో..)

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక

## సం పా దకీయం

## ప్రజా రవాణానే.. కాలుష్యానికి పరిష్కారం!

నగరాల్లో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల సంఖ్య ట్రాఫిక్ సమస్యలతో పాటు వాయు కాలుష్యాన్నీ పెంచుతోంది. గంటల తరబడి రహదారులపై ప్రయాణించడం వల్ల సమయం వృథా కావడమే కాకుండా ఇంధన ఖర్చులు కూడా అధికమవుతున్నాయి. ఈ సమస్యలకు ప్రజా రవాణా సమర్థవంతమైన పరిష్కారంగా నిలవగలదు. బస్సులు, మెట్రో రైళ్లు, ఇతర ప్రజా రవాణా సదుపాయాలను మరింత విస్తరించి, ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు అందించాలి. నిర్ణీత సమయాలకు వాహనాలు నడపడం, రద్దీ మార్గాల్లో సర్వీసులను పెంచడం, చివరి గమ్యస్థానం వరకు కనెక్టివిటీ కల్పించడం అవసరం. ప్రజా రవాణా అందుబాటులో ఉంటే వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గే అవకాశం ఉంటుంది. ప్రజలు కూడా చిన్న దూరాలకు నడక, సైక్లింగ్ వంటి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలి. అయితే ఇందుకు సురక్షితమైన ఫుట్‌పాత్‌లు, సైకిల్ మార్గాలు అందుబాటులో ఉండాలి. ప్రజా రవాణాను బలోపేతం చేయడం ప్రభుత్వ బాధ్యత.. దాన్ని సద్వినియోగం చేసుకోవడం ప్రజల బాధ్యత. ట్రాఫిక్ తగ్గి, కాలుష్యం నియంత్రణలోకి వచ్చి, ప్రయాణం సులభమైతేనే నగర జీవనం ఆరోగ్యకరంగా మారుతుంది.

## అరెస్టును ముందే ఊహించి... వీడియో విడుదల చేసిన అభిజీత్ దీప్కే

విమానం ఢిల్లీలో ల్యాండ్ అయిన వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన నిరసనకు కొన్ని గంటల ముందే ఈ ఘటన జరిగింది. ముంబై నుంచి ఢిల్లీకి ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణించిన అభిజీత్ దీప్కే, పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోశ్ రంకాలను విమానం ల్యాండ్ అయిన కొద్దిసేపటికే మహిళా అధికారులతో కూడిన ఢిల్లీ పోలీసుల బృందం అదుపులోకి తీసుకుంది. ఈ సందర్భంగా విమానంలోనే దీప్కే పోలీసుల చర్యను తీవ్రంగా నిరసించారు. తాను అరెస్టుకు సిద్ధపడే వచ్చానని, ఎవరికీ భయపడబోనని పోలీసులకు సవాల్ విసిరారు. ఈ పరిణామాలను నియంతృత్వంగా అభివర్ణించిన ఆయన, ఎమర్జెన్సీ సమయంలో ఇందిరా గాంధీ కూడా ఇలా వ్యవహరించలేదని వ్యాఖ్యానించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు అనుమతి లేనందున, ముందస్తు జాగ్రత్తగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సీజేపీ ఈ నిరసనకు పిలుపునిచ్చింది. తమ నేతలు నిరసన ప్రదేశానికి చేరుకోకుండా అడ్డుకోవడానికే పోలీసులు ఈ నిర్బంధాలకు పాల్పడ్డారని సీజేపీ ఆరోపించింది. అయితే, తన అరెస్టును ముందుగానే ఊహించిన అభిజీత్ దీప్కే నిన్న రాత్రే ఒక వీడియో సందేశాన్ని రికార్డ్ చేశారు. తమ లీడర్లు పోలీసుల అదుపులోకి వెళ్లిన వెంటనే సీజేపీ ఆ వీడియోను విడుదల చేసింది. "మీరు ఈ వీడియో చూస్తున్నారంటే నాతో పాటు సౌరవ్, అశుతోశ్ లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని అర్థం. మా గైర్హాజరీలో పార్టీ ఆర్గనైజేషన్ ఇన్‌చార్జ్ అజింక్య షిండే జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తారు. కార్యకర్తలంతా ఆయనకు మద్దతుగా నిలవాలి" అని దీప్కే ఆ వీడియోలో తన మద్దతుదారులను కోరారు.

### హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

మొదటి పేజీ తరువాయి)

నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం ఈ వివరాలను కిషన్ రెడ్డి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. "రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా చట్టవిరుద్ధం" అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం. మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది. ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు.

## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు: మంత్రి పొంగులేటి

మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 21.86 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. ఈ గణాంకాలే ప్రభుత్వ పనితీరుకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనా సామర్థ్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం భూములపై బీఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలను, ఆరోపణలను ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూ అక్రమాలను తమ ప్రభుత్వం వెలికితీస్తోందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, ప్రజలకు వివాదరహిత భూములను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.

## 'ఎంత మంది పోలీసులనైనా మోహరించుకోండి'.. ప్రధాని మోదీకి రాహుల్ సవాల్!

మొదటి పేజీ తరువాయి)

పిలవండి. మా నేతలందరినీ, యువతను, మమ్మల్ని అరెస్ట్ చేయండి. కానీ మేం మిమ్మల్ని చుట్టుముడుతున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని రాహుల్ గాంధీ తన వీడియోలో ఘాటుగా హెచ్చరించారు. తమ వద్ద అవసరమైన సమాచారం ఉందని, రాజ్యాంగాన్ని, ప్రజల గొంతుకను కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. గడిచిన 10–15 ఏళ్లలో జరిగిన అన్యాయాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. దేశ యువత ధైర్యాన్ని చూసి గర్వపడుతున్నానని, నిరసనలు కొనసాగించాలని వారికి పిలుపునిచ్చారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించాయి. అయితే, శాంతిభద్రతల కారణాలను చూపుతూ ఢిల్లీ పోలీసులు ఈ ప్రదర్శనకు అనుమతి నిరాకరించారు. నిరసన స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నించిన పలువురిని అదుపులోకి తీసుకుని, భారీగా పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ పై వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఎన్నికల అంశాలపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సాగిస్తున్న పోరాటంలో భాగంగానే రాహుల్ ఈ ప్రకటన చేశారు.

## 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'.. ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నవారు దేశద్రోహానికి పాల్పడుతున్నట్లేనని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) వ్యతిరేక నిరసనపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో యువతను అదుపులోకి తీసుకోవడంపై ప్రియాంకా గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. గతంలో 254 మంది ఎంపీలను ఇబ్బందులకు గురిచేసి, అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నిరసనకారులపైనా అదే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దేశ రాజధానిని దిగ్బంధించి, రైళ్లు, మెట్రో సేవలను అడ్డుకుని, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, అడుగడుగునా తనిఖీలు చేపడుతున్నారని ప్రియాంక ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును వినియోగించుకుంటున్న యువతపై దాడులు చేసి అదుపులోకి తీసుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం సహకారంతో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో నియంతృత్వ పాలన సాగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ఈ ఘటనలపై స్పందించారు. ఢిల్లీని కోటలా మార్చేశారని, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను చూసి ప్రభుత్వం ఆందోళన చెందుతోందని అన్నారు. రాజ్యాంగంలోని 326వ అధికరణం కల్పించిన ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. దాదాపు 14 కోట్ల మంది భారతీయుల ఓటు హక్కులు ఇప్పటికే తొలగించారని ఆరోపిస్తూ, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ఈ ప్రక్రియను రద్దు చేయాలని పేర్కొన్నారు.

## ఢిల్లీలో 'అప్రకటిత ఎమర్–జెన్‌జీ': కేంద్రంపై శశి థరూర్ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

ఎప్పుడూ చూడలేదని థరూర్ పేర్కొన్నారు. కొన్ని వందల మీటర్లకే చెక్‌పోస్టులు, రోడ్లపై కాంక్రీట్ బారికేడ్లు, స్పైక్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. నగరం అంతటా 22,000 మంది పోలీసులు, పారామిలటరీ బలగాలను మోహరించడం యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోందన్నారు. సుమారు 250 రైళ్లు రద్దు కావడం, 45 మెట్రో స్టేషన్లు మూసివేయడం, రాజధాని నడిబొడ్డున ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం వంటి చర్యలు తిరోగమనానికి సంకేతమని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR)కు వ్యతిరేకంగా సీజేపీ జంతర్ మంతర్ వద్ద నిరసనకు పిలుపునిచ్చింది. అయితే, ఢిల్లీ పోలీసులు ఈ నిరసనకు అనుమతి నిరాకరించారు. ఆందోళనకారులు గుమిగూడకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సహా వందలాది మంది నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల నిర్వహణపై నమ్మకం ఉన్న ప్రభుత్వం ప్రశ్నలను స్వాగతిస్తుందని, కానీ రాజధానిని కోటగా మార్చడం మరిన్ని అనుమానాలను రేకెత్తిస్తుందని థరూర్ అన్నారు. "ప్రభుత్వం సమాధానాలు చెప్పాలి కానీ లాఠీలతో దాడులు చేయకూడదు. భావప్రకటనను గౌరవించాలి కానీ అణచివేతకు పాల్పడకూడదు" అని ఆయన హితవు పలికారు. ప్రజాస్వామ్యం పనితీరును ప్రశ్నించేవారి పట్ల ప్రభుత్వం వ్యవహరించే తీరు సిగ్గుచేటని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఢిల్లీలో హై టెన్షన్.. మమతా, కేజ్రీవాల్ సహా పలువురు మాజీ సీఎంల అరెస్ట్

మొదటి పేజీ తరువాయి)

నిర్బంధించి డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. ఎన్నికల కమిషన్, ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన ఆరోపణలపై విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనేందుకు మమతా బెనర్జీ ఢిల్లీకి వచ్చారు. సెంట్రల్ ఢిల్లీలోని సౌత్ అవెన్యూ సమీపంలో పోలీసులు ఆమెను అడ్డుకోవడంతో, సమీపంలోని బస్టాండ్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ఆమెను, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, డోలా సేన్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు ఇదే నిరసనలో పాల్గొనేందుకు తన నివాసం నుంచి బయటకు వస్తున్న అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు మార్గమధ్యంలోనే నిర్బంధించారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ వంటి ఇతర నేతలను కూడా అరెస్ట్ చేశారు. జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఈ నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీకి చేరుకున్న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కేను కూడా పోలీసులు నిర్బంధించారు. నగరంలో నిరసనలకు ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఆందోళనకు ముందస్తు అనుమతి లేనందునే నేతలను అదుపులోకి తీసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణలతో పాటు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై విపక్షాలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల కమిషన్ జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టాయి. ఈ అరెస్టుల నేపథ్యంలో భవిష్యత్తులో తమ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని విపక్ష నేతలు సూచిస్తున్నారు.

## తెలంగాణలో ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు

మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమయ్యాయి. తెలంగాణ సాంస్కృతిక అస్థిత్వానికి, ప్రకృతితో ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పూల పండుగ తొమ్మిది రోజుల పాటు కొనసాగనుంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, యువతులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సంప్రదాయ వస్త్రాలు ధరించిన మహిళలు, తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకుని ఆలయాలు, సామూహిక ప్రదేశాలకు తరలివచ్చారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ, చప్పట్లతో సందడి చేశారు. చారిత్రక హనుమకొండలోని వెయ్యి స్తంభాల గుడిలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంలోనూ ఉత్సవాలు నిర్వహించారు. నేడు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు, అక్టోబర్ 18న జరిగే సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. అక్టోబర్ 20న దసరా పండుగ జరగనుంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత, నైవేద్యం ఉంటుంది. ఈ ఉత్సవాల కోసం తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రధాన కూడళ్లను, ప్రభుత్వ కార్యాలయాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించింది. అక్టోబర్ 18న హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ప్రధాన సద్దుల బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సచివాలయం సమీపంలోని అమరవీరుల స్థూపం నుంచి మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా బయలుదేరి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఘాట్ల వద్ద నిమజ్జనం చేస్తారు. ఈ కార్యక్రమానికి భారీగా తరలివచ్చే ప్రజల కోసం ట్రాఫిక్ మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు వంటి పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, గ్రామాలు, పట్టణాల్లోని పాఠశాలల్లోనూ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తంగేడు, గునుగు వంటి సంప్రదాయ పూలతో బతుకమ్మలను పేరుస్తూ, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నారు.

### తమిళనాట ఆసక్తికరం... కాఫీ తాగుతూ కేఫ్‌లో రాహుల్ గాంధీ, సీఎం విజయ్ ముచ్చట్లు

మొదటి పేజీ తరువాయి)

ఎలా ఉంటుందో చెన్నై నగరం ప్రత్యక్షంగా వీక్షించింది. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ మధ్య జరిగిన ఈ భేటీ, ఇరు నేతల మధ్య బలపడుతున్న స్నేహ బంధానికి, రాజకీయ సమన్వయానికి అద్దం పట్టింది. శనివారం ఉదయం చెన్నై శివార్లలోని నీలంకరైలో గల తన నివాసానికి విచ్చేసిన రాహుల్ గాంధీకి సీఎం విజయ్ సాదర స్వాగతం పలికారు. ఇరువురు నేతలు సుమారు గంటపాటు సమావేశమై సమకాలీన రాజకీయ పరిణామాలపై చర్చించారు. కేవలం అధికారిక చర్చలకే పరిమితం కాకుండా, వారి మధ్య నెలకొన్న స్నేహపూర్వక వాతావరణం అందరి దృష్టినీ ఆకర్షించింది. తూర్పు తీర రహదారి వెంట ప్రశాంతంగా ఉండే నీలంకరై ప్రాంతంలో ప్రారంభమైన ఈ భేటీ, అనంతరం సమీపంలోని ఒక కేఫ్‌కు మారింది. అక్కడ ఇద్దరు నేతలు క్యాపిచినో, టిరమిసు, కుకీలు ఆస్వాదిస్తూ.. సాధారణ రాజకీయ సమావేశాలకు భిన్నమైన వాతావరణంలో గడిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో కేఫ్ వద్దకు చేరుకున్నారు. రాహుల్, విజయ్ వారితో సరదాగా ముచ్చటించి సెల్ఫీలు దిగారు. వీటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కేఫ్ నుంచి నిష్క్రమించిన అనంతరం రాహుల్ గాంధీ నగరంలోని ఓ హోటల్‌కు చేరుకున్నారు. యువత కోసం ఉద్దేశించిన 'ఛాత్రోన్ కీ గూంజ్' తాజా ఎడిషన్‌లో పాల్గొనేందుకు ఆయన చెన్నై పర్యటనకు వచ్చారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు వ్యాప్తంగా లక్ష మందికి పైగా విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
అక్టోబర్ | ఆదివారం | 11 | 2026



# ఉన్నత విద్య జీవిత గమనాన్నే మార్చి వేస్తుంది

- క్రమ శిక్షణ,పట్టుదలతో చదివి ఉన్నత స్దితికి చేరుకోవాలి
- ప్రముఖ వ్యాపారి శ్రీనివాస గుప్త

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం, అక్టోబర్ 10 (జనసంఘర్షణ):**

ఉన్నత విద్య జీవిత గమనాన్నే మార్చి వేస్తుందని, పట్టుదలతో చదివి ఉన్నత స్దితికి చేరుకోవడం ద్వారా తల్లిదండ్రులు కన్న కలలు సాకారమవుతాయని ప్రముఖ వ్యాపారి కొప్పరపు శ్రీనివాస గుప్త అన్నారు. బతుకమ్మ పర్వదినం సందర్భంగా తన తల్లిదండ్రులు కొప్పరపు వెంకటనారాయణ - సరోజిని దంపతుల జ్ఞాపకార్ధం వారి కుమారుడు శ్రీనివాస గుప్త - రేణుక దంపతులు వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్ది నిలయంకు 50 కేజీల బియ్యం, 5 కేజీల ఫ్రీడం ఆయిల్, 5 కేజీల కంది పప్పుతో పాటుగా విద్యార్ధులకు పండ్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కొమరం భీం విద్యార్ధి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అద్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాస గుప్త, విద్యార్దులను ఉద్దేసించి మాట్లాడారు. చదువుతోనే విద్యసార్దకత ఉంటుందని, ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టిసారించి ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇక్కడి నిలయ విద్యార్దుల క్రమశిక్షణ తమను ఆకట్టుకున్నాయని తెలిపారు. వనవాసీ సంస్ద అవసరాలను తీర్చేందుకు తాము సిద్దంగా ఉంటామని వెల్లడించారు. విద్యార్ధి నిలయ కార్యదర్శి మురళీకృష్ణ మాట్లాడుతూ, తమ సంస్ద గిరిజనుల అభ్యున్నతి కొరకు పని చేస్తుందని ఇందుకు గాను దేశ వ్యాపితంగా బాల, బాలికలకు అనేక వసతి గృహాలను



ఏర్పాటు చేసి విద్యాబుద్దులు నేర్పిస్తోందని వెల్లడించారు. తమ వసతి గృహాలలో విద్యతో పాటు వినయ విధేయతలు కృతజ్ఞతలు నేర్పుతారన్నారు. నిలయ కమిటీ ఉపాద్యక్షుడు గోగికార్ రాంలక్ష్మణ్ మాట్లాడుతూ, సంస్ద ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం తీసుకోదని కేవలం సహాయ ధాత్రుత్వం కలిగిన దాతల ద్వారా నడుస్తుందని వెల్లడించారు. దేశభక్తులను తయారు చేసే సంస్దకు సహకారమందించాలని పిలుపు నిచ్చారు. గిరిజనుల అభ్యున్నతి కొరకు సంస్ద అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని వెల్లడించారు. కార్యక్రమంలో నిలయ ప్రముఖ్ సంతోష్, స్దానికులు ముదిగొండ సతీష్, బర్ల సుధాకర్, విద్యార్దుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో పాటిమీదగుంపు సర్పంచ్ దంపతులు

- పండితపురం సంత పెట్రోల్ బంక్ సమీపంలో ఘటన
- మద్యం మత్తులో స్కూటీ నడిపి ఢీకొట్టినట్లు బాధితుల ఆరోపణ.. కామేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**కారేపల్లి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్**

ప్రమాదాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అమాయకులు ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలో పాటిమీదగుంపు గ్రామ సర్పంచ్ గుగులోత్ సుజాత, ఆమె భర్త సంతోష్ దంపతులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఖమ్మంలోని మమత ఆసుపత్రికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా పండితపురం సంత సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.

### ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం

పాటిమీదగుంపు గ్రామ సర్పంచ్ గుగులోత్ సుజాతకు వైద్య పరీక్షలు చేయించేందుకు ఆమె భర్త సంతోష్‌తో కలిసి ఖమ్మంలోని మమత ఆసుపత్రికి వెళ్లారు. ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్న అనంతరం ఇద్దరూ తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో పండితపురం సంత సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగానే ఎదురుగా స్కూటీపై వచ్చిన వ్యక్తి వారి వాహనాన్ని ఢీకొట్టినట్లు తెలిసింది. అనుకోకుండా జరిగిన ఈ ప్రమాదంతో సర్పంచ్ దంపతులు ఆందోళనకు గురయ్యారు.

### మద్యం మత్తులో వాహనం నడిపినట్లు ఆరోపణ

ఎదురుగా స్కూటీపై వచ్చిన వ్యక్తి మద్యం మత్తులో వాహనం నడుపుతూ తమ వాహనాన్ని ఢీకొట్టినట్లు సర్పంచ్ దంపతులు ఆరోపించారు. రహదారిపై ప్రయాణించే సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనం నడిపే వ్యక్తితో పాటు ఎదురుగా వచ్చే వాహనదారుల ప్రాణాలకు సైతం ముప్పు ఏర్పడే అవకాశం ఉంది.



### కామేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ఈ ప్రమాదానికి సంబంధించి సర్పంచ్ దంపతులు కామేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తమ వాహనాన్ని స్కూటీతో ఢీకొట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. అయితే ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, దర్యాప్తు పురోగతి, బాధితులకు అయిన గాయాల తీవ్రతపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

### మద్యం సేవించి వాహనాలు నడపవద్దు

మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం మాత్రమే కాకుండా రోడ్డు భద్రతకు తీవ్ర విఘాతం కలిగించే చర్య. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ఇతరుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు సూచిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారులు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, సంతలు, పెట్రోల్ బంకుల సమీపంలో వాహనదారులు మరింత జాగ్రత్తగా ప్రయాణించాల్సిన అవసరం ఉంది.ప్రజాప్రతినిధులైనా, సాధారణ పౌరులైనా రహదారిపై ప్రయాణించేటప్పుడు భద్రతకు హామీ ఉండాలని, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## జన సంఘర్షణ కథనానికి స్పందన

# మూడు రోజుల తర్వాత స్పందించిన అధికారులు.. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు






- జన సంఘర్షణ వార్తతో కదిలిన అధికారులు.. వృథా అవుతున్న నీటిని అరికట్టేందుకు చర్యలు

**నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల బ్యూరో / అక్టోబర్ 10 / (జన సంఘర్షణ):**

జన సంఘర్షణ వార్తా కథనంతో అధికారులు స్పందించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీరు వృథా అవుతున్న విషయాన్ని వెలుగులోకి తీసుకువస్తూ జన సంఘర్షణ పత్రికలో ప్రచురించిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. వార్త ప్రచురితమైన మూడు రోజుల తర్వాత అధికారులు స్పందించి, పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేయించారు.

వార్తా కథనంతో అధికారుల్లో కదలిక..!

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీరు వృథా అవుతున్న అంశాన్ని జన సంఘర్షణ తన వార్తా కథనం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ప్రజలకు అవసరమైన తాగునీరు వృథా అవుతున్న విషయాన్ని కథనం ద్వారా ప్రస్తావించింది. ఈ వార్త ప్రచురితమైన మూడు రోజుల అనంతరం సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టారు.నీరు ప్రతి ఒక్కరికీ అవసరమైన ప్రాథమిక వనరు. ప్రజలకు తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో పైప్‌లైన్లలో లీకేజీలు ఏర్పడి నీరు వృథా కావడం ఆందోళన కలిగించే అంశం. లీకేజీలను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపడితే నీటి వృథాను అరికట్టవచ్చు.

సమస్యల పరిష్కారంలో పత్రికల పాత్ర కీలకం...

ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం పత్రికల బాధ్యత. ఈ క్రమంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ సమస్యపై జన సంఘర్షణ ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టడం గమనార్హం.ప్రజా సమస్యలపై వార్తలు...ప్రచురితమైనప్పుడు సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి, వాస్తవ పరిస్థితులను గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుంది. సమస్యలపై సకాలంలో స్పందించి పరిష్కార చర్యలు చేపడితే ప్రజలకు కలిగే ఇబ్బందులను తగ్గించవచ్చు.

ప్రజా సమస్యలపై జన సంఘర్షణ నిరంతర పోరాటం...

ప్రజలకు సంబంధించిన సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టిని ఆకర్షించడంలో జన సంఘర్షణ తన వంతు పాత్ర పోషిస్తోంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ సమస్యపై ప్రచురించిన వార్తకు మూడు రోజుల తర్వాత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించడం ఈ కథనానికి లభించిన స్పందనగా నిలిచింది.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వార్తా కథనాలను ప్రచురిస్తూ, ప్రజల గొంతుకగా నిలవడమే జన సంఘర్షణ ధ్యేయం.




# అక్టోబర్ 17న చర్ల తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

- తుడుందెబ్బ పిలుపు
- సీనియర్ నాయకులు తాటి రామక్రిష్ణ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, అక్టోబర్10(జనసంఘర్షణ):**



చర్ల మండలంలో ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు తుడుందెబ్బ నాయకులు తెలిపారు.చర్ల మండల కేంద్రంలోని తుడుందెబ్బ కార్యాలయంలో తుడుందెబ్బ సీనియర్ నాయకులు తాటి రామకృష్ణ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ మండల అధ్యక్షులు పూనెం రవికిరణ్ మాట్లాడుతూ, చర్ల మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల్లోకి వలస గిరిజనేతరులు అక్రమంగా ప్రవేశిస్తూ ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆదివాసుల పట్ల అధికారుల వ్యవహారశైలి, చట్టాల అమలులో జరుగుతున్న నిర్లక్ష్యంపై సమాధానాలు కోరేందుకే అక్టోబర్ 17న చర్ల తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఏజెన్సీ ప్రాంతాల్లోని సహజ వనరుల దోపిడీని అరికట్టడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, 1/70 చట్టం, ఎల్‌టీఆర్ నిబంధనలను, పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసుల హక్కుల పరిరక్షణ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, ఈ సమస్యల పరిష్కారం కోసమే తుడుందెబ్బ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి చేపడుతున్నట్లు వెల్లడించారు.ఈ సమస్యలు కేవలం తుడుందెబ్బకు మాత్రమే సంబంధించినవి కావని, చర్ల మండలంలోని ఆదివాసీ సమాజం మొత్తం ఎదుర్కొంటున్న సమస్యలని ఆయన పేర్కొన్నారు. అందువల్ల మండలంలోని ప్రతి గూడెం నుంచి ఆదివాసీ పెద్దలు, ఉద్యోగులు, యువతీ యువకులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొని ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ తరఫున పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో తుడుందెబ్బ ఉపాధ్యక్షులు తుర్రం ఆదినారాయణ, పురిటి ప్రశాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ కలం శ్రీనివాస్, కోశాధికారి సోడి రవీంద్ర, సహాయ కార్యదర్శి తాటి శ్రీను, తుర్రం గోపాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ--తెలంగాణ ప్రజలకు ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు...

**యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్...**

తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు,ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా భావిస్తారని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్ అన్నారు.ప్రకృతిని ఆరాధిస్తూ,వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి,ఆటపాటలతో భక్తిశ్రద్ధల మధ్య జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతుందని పేర్కొన్నారు.తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప వేడుక బతుకమ్మ అని ఆయన తెలిపారు.తొమ్మిది రోజుల పాటు మహిళలు,యువతులు ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తూ,తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెబుతున్నారని అన్నారు.బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు,సిరిసంపదలు వెల్లివిరియాలని,ప్రతి ఇంటా ఆనందం,ఐక్యత,సౌభాగ్యం నిండాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.




# మెదక్ పట్టణంలో కాగడాల ప్రదర్శన.

**మెదక్ మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 (జన సంఘర్షణ)**

మెదక్ జిల్లా ఆవిర్భావ దశాబ్ది సందర్భంగా కాగడాల ప్రదర్శన.శనివారం సాయంత్రం 7 గంటలకు నిర్వహణ. పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం.తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రస్తుత మెదక్ జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన సాయంత్రం 7 గంటలకు మెదక్ పట్టణంలోని మార్కెట్ కమిటీ కమాన్ నుంచి మెదక్ ఆర్టీసీ డిపో వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది.ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డితో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాజీ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ రాష్ట్ర నాయకులు కంటరెడ్డి తిరుపతి రెడ్డీ తో పాటు జిల్లాకు చెందిన ముఖ్య నాయకులుహాజరుకానున్నారు. కావున మాజీ చైర్మన్లు, మాజీ వైస్ చైర్మన్,మున్సిపల్ కౌన్సిలర్లు,పట్టణ పార్టీ నాయకులు,వార్డు,బూత్ ఇన్‌చార్జీలు,విద్యార్థి విభాగం నాయకులు,సోషల్ మీడియా ప్రతినిధులు,పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని మనవి.సాయంత్రం 6.30 గంటలలోపు మార్కెట్ కమిటీ కమాన్ వద్దకు అందరు చేరుకోవాలని మనవి. మెదక్ పట్టణ టిఆర్ఎస్ పార్టీ నాయకులు కోరారు.



# గవర్నర్ కోట ఎమ్మెల్సీ రేసులో నీలం మధు ముదిరాజ్.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 (జన సంఘర్షణ)**

మూడు స్థానాల భర్తీ వేళ కాంగ్రెస్ లో కొత్త సమీకరణాలు, తెలంగాణలో నవంబర్లో మూడు గవర్నర్ కోట ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో భాషా హవుల సందడి పెరుగుతుంది. ఈ క్రమంలో ఎమ్మెల్సీ పదవి కోసం నీలం మధు ముదిరాజ్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. పార్టీకి చేసిన సేవలు, సామాజిక సమీకరణాల నేపథ్యంలో ఆయనకు పదవి దక్కుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. గోరటి వెంకన్న, బసవరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్ ల పదవీకాలం ముగియడంతో ఈ గవర్నర్ ఎమ్మెల్సీ కోటాకు నీలం మధు ముదిరాజ్ సైతం పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక

## రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి

**26 ఏళ్ల యువ జవాన్ అకాల మరణంతో అందాపూర్లో విషాదం**

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల బ్యూరో / అక్టోబర్ 10 / (జన సంఘర్షణ)



బోధన్ మండలం అండాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ నవత్ రక్షిత్ (26) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని ఆటోనగర్ సమీపంలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు బైక్పై నుంచి పడిపోవడంతో రక్షిత్ మృతి చెందారు. దేశ రక్షణలో సేవలందిస్తున్న యువ జవాన్ అకాల మరణవార్తతో అండాపూర్ గ్రామంలో విషాదం నెలకొంది. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## విద్యుత్ డిమాండ్ పైపైకి.

**మెదక్ జిల్లాలో రికార్డు విద్యుత్ డిమాండ్.**

**రికార్డుడిమాండ్ కు దీటుగా విద్యుత్ సరఫరా.**

**జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ నారాయణ నాయక్ ప్రకటన.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 (జన సంఘర్షణ)




విద్యుత్ డిమాండ్ పైపైకి , వెళ్తున్నట్లు మెదక్ జిల్లాలో రికార్డు విద్యుత్ డిమాండ్ రికార్డు డిమాండ్ కు దీటుగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు జిల్లా సూపరిండెంట్ (ఎస్ సి) ఇంజనీర్ నారాయణ నాయక్ శనివారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు.విద్యుత్ అంతరాయంపై మీడియా లో వస్తున్న వస్తున్న వరుస కథనాలపై ఆయన స్పందిస్తూ శనివారం ఒక్క ప్రకటన విడుదల చేశారు. వాతావరణ మార్పులు,ఎల్ నీనోవా ప్రభావం,పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో రాష్ట్ర వ్యాప్తముగా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యములో మెదక్ జిల్లాలోను విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని . గత సంవత్సరము ఆక్టోబరు నెలలో 282వీఔ డిమాండ్ నమోదు కాగా ,ఈ సంవత్సరము ఆక్టోబరు నెలలో 567వీఔ డిమాండ్ నమోదు అయినది అనగా రెండింతల డిమాండ్ పెరిగిందన్నారు.వేసవి కాలంలో మార్చి నెల డిమాండ్ 506వీఔ డిమాండ్ దాటి రికార్డు సృష్టించిందని వివరించారు.విద్యుత్ డిమాండ్ రోజు రోజుకు పెరుగుతూనే వుందని గృహ అవసరాలకు వ్యవసాయ రంగానికి విద్యుత్ డిమాండ్ పెరిగినప్పటికీ ,ముందస్తు ప్రణాళికతో సరఫరా వ్యవస్థను బలోపేతము చేయడంతో డిమాండ్ ను కరెంట్ విషయంలో మెదక్ జిల్లా విద్యుత్ శాఖ సమర్థవంతముగా ఎదుర్కొంటుందని వివరించారు.విద్యుత్ ఎలాంటి కోతలు లేకుండా నిరంతర,సరఫరా అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు మా విద్యుత్ శాఖ అధికారులు అన్ని జాగ్రత్తలుతీసుకొంటున్నారు.సబ్ స్టేషన్ ల వద్ద వోల్టేజీని మెరుగు పరచడానికి హైద్రాబాదు నుండి 17( 2MVAR ) కెపాసిటర్ బ్యాంకులను యుద్ధ ప్రాతిపదికన తరలించి సబ్ స్టేషన్ వద్ద వోల్టేజి అరికెట్టుందుకు రామాయంపేట ప్రగతి ధర్మారం హేవాలి ఘనపూర్ మండలం లోని కుచాన్ పల్లి సబ్ స్టేషన్ లో పవర్ ట్రాన్సఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచి ఓవర్ లోడ్ సమస్యనుఅధిగమించామని . అవసరమైన చోట అదనపు విద్యుత్ ట్రాన్ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.జిల్లా వ్యాప్తంగా గృహ విద్యుత్ వినియోగదారులతోపాటు వ్యవసాయ సంబంధిత విద్యుత్తును నాణ్యంగా అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఈ విషయంలో తమ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని మెదక్ విద్యుత్ శాఖ జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ నారాయణ నాయక్ మీడియాకు తెలిపారు.అలాగే వరి పంటలు పొట్ట దశలో వున్నాయని వరి పంటతోపాటు ఇతర పంటలు ఎండిపోకుండా నిరంతరం విద్యుత్తు సరఫరా చేస్తున్నామని ఈ విషయంలో అన్నదాతలు ఏమాత్రం ఆందోళనలు చెందవద్దని నారాయణ నాయక్ స్పష్టం చేశారు. రైతులకు మా శాఖ ఎల్లప్పుడూ సహకారం వుంటుదని తెలియ జేశారు.

## రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదవ వార్డులో కరెంటు స్టార్టర్ చోరీ. రైతు ఆరోపణ.

రామాయంపేట అక్టోబర్ (10) (జన సంఘర్షణ)



రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి గ్రామంలో 9వ తారీకు సాయంత్రం దొంగలు నా యొక్క స్టార్టర్ ఫీజులు, ప్రివెంటర్ ఎత్తుకెళ్లినారు.మెయిన్ పోల్ నుంచి వచ్చే వైర్లను కరెంట్ షాట్ తగిలే విధంగా కింద వైర్లను అమర్చి పెట్టి పోయిన దృశ్యం. ఇట్టి విషయం పైన స్థానికంగా ఉన్నటువంటి రామాయంపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని రైతు తెలిపారు.

## “నూతన బోధన్ ఏఎంసీ చైర్మన్‌కు ఘన సన్మానం

**రైతుల సంక్షేమానికి కృషి చేయాలి: మందర్న రవి**

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల బ్యూరో / అక్టోబర్ 10 / (జన సంఘర్షణ):

బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన చైర్మన్‌గా నియమితులైన నాగేశ్వరరావును హున్సా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సాలూర మండల అధ్యక్షుడు మందర్న రవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మందర్న రవి మాట్లాడుతూ.. సాలూర మండల రైతులు, ప్రజల తరఫున నూతన ఏఎంసీ చైర్మన్ నాగేశ్వరరావుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని, రైతులు తమ పంటలను దళారుల ప్రమేయం లేకుండా గిట్టుబాటు ధరలకు విక్రయించుకునేలా అవసరమైన సహకారం అందించాలని ఆకాంక్షించారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మార్కెట్ యార్డులో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పంటల కొనుగోళ్లలో పారదర్శకత, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని మందర్న రవి తెలిపారు. రైతుల అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగేందుకు తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తగ్గెల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవరావు, అమ్ముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## దివ్యాంగుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపడమే లక్ష్యం








- **బాన్సువాడ నియోజకవర్గంలో కృత్రిమ అవయవాల పంపిణీకి శ్రీకారం..**
- **దసరా అనంతరం మండలాల వారీగా ప్రత్యేక క్యాంపులు.. ప్రతి అర్హుడికీ అండగా నిలిచేందుకు మాజీ డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి సంకల్పం..**

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల బ్యూరో/అక్టోబర్ 10/ (జనసంఘర్షణ):




ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారికి చేయూతనివ్వడం.. వైకల్యం కారణంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగుల జీవితాల్లో కొత్త ఆశలు నింపడం.. ఇదే నిజమైన మానవత్వానికి నిదర్శనం. ఇలాంటి మానవతా దృక్పథంతో బాన్సువాడ నియోజకవర్గంలోని దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందించాలనే సంకల్పంతో మాజీ డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి ప్రత్యేక సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.నియోజకవర్గ పరిధిలోని ప్రతి దివ్యాంగుడికి వారి అవసరాలకు అనుగుణంగా కృత్రిమ చేతులు, కాళ్లు అందించి, వారు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు తోడ్పడటమే తన ప్రధాన లక్ష్యమని భాస్కర్ రెడ్డి తెలిపారు. ఆర్థిక స్థోమత లేక అవసరమైన కృత్రిమ అవయవాలను సమకూర్చుకోలేక ఇబ్బందులు పడుతున్న వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు.

**ముగ్గురితో ప్రారంభం.. అన్ని గ్రామాలకూ సేవల విస్తరణ**

ఈ సేవా కార్యక్రమంలో భాగంగా గత సెప్టెంబర్ 30న బాన్సువాడ పట్టణ కేంద్రంలో ముగ్గురు దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేసినట్లు భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కేవలం పట్టణానికే పరిమితం చేయకుండా, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు విస్తరించాలన్నది తన సంకల్పమని పేర్కొన్నారు.ప్రతి గ్రామంలో అవసరమైన సహాయం కోసం ఎదురుచూస్తున్న దివ్యాంగులను గుర్తించి, వారికి అవసరమైన సహాయక పరికరాలు అందేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఒక్కొక్కరికి సహాయం అందించడం ద్వారా వారి జీవితాల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించవచ్చని, వారు ఇతరులపై ఆధారపడకుండా తమకు సాధ్యమైన పనులు చేసుకుంటూ గౌరవప్రదంగా జీవించేందుకు ఈ సహాయం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ప్రతి గ్రామంలో దివ్యాంగులను గుర్తించాలి...**

బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని భాస్కర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లోని దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి వారి పూర్తి వివరాలు, ఫోన్ నంబర్లు, అంగవైకల్యానికి గల కారణాలు, వారికి అవసరమైన కృత్రిమ అవయవాలు, ఇతర సహాయక పరికరాల వివరాలను సేకరించి అందించాలని కోరారు.దసరా పండుగ అనంతరం మండలాల వారీగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపుల ద్వారా అర్హులైన దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లోని ప్రతి అర్హుడికీ ఈ కార్యక్రమం గురించి సమాచారం చేరవేయడంతో పాటు, వారిని క్యాంపులకు తీసుకువచ్చేందుకు నాయకులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు.

**ఆర్థిక ఇబ్బందులు అడ్డుకాకూడదు.. ఆత్మవిశ్వాసమే తోడుగా నిలవాలి....**

కృత్రిమ అవయవాలు అవసరమైనప్పటికీ వాటిని కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేక చాలామంది దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. అలాంటి వారికి సహాయం అందించడం ద్వారా వారి జీవితాల్లో సానుకూల మార్పుకు అవకాశం కల్పించవచ్చని తెలిపారు.దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించడంలో సమాజంలోని ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉందని, నాయకులు, ప్రజాప్రతినిధులు, సేవాభావం కలిగిన వ్యక్తులు ముందుకొస్తే మరింత మందికి ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. గ్రామస్థాయిలో అర్హులను గుర్తించడం నుంచి వారికి అవసరమైన సహాయం అందే వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

**“ఒక్కరి జీవితంలో మార్పు తీసుకొచ్చినా అదే నిజమైన సేవ**

సేవ చేయడానికి పెద్ద పదవులు, అపారమైన సంపద మాత్రమే అవసరం లేదని.. అవసరంలో ఉన్నవారికి అండగా నిలవాలనే మంచి మనసు ఉంటే చాలని ఈ కార్యక్రమం సందేశమిస్తోంది. కృత్రిమ అవయవాల రూపంలో అందించే సహాయం ఒక దివ్యాంగుడికి నడకలోనే కాదు, జీవితంలోనూ కొత్త ధైర్యాన్ని అందించగలదు. కుటుంబానికి భరోసా కల్పించడంతో పాటు, సమాజంలో ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రేరణనిస్తుంది. ఈ నేపథ్యంలో బాన్సువాడ... నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అర్హులైన దివ్యాంగులను గుర్తించి, వారికి అవసరమైన సహాయం అందేలా సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఒక్క అర్హుడు కూడా ఈ సేవా కార్యక్రమానికి దూరం కాకుండా చూడాలన్నదే ఈ ప్రయత్నం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.

భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... “కృత్రిమ అవయవాలను పొందలేక ఇబ్బందులు పడుతున్న వారికి అండగా నిలబడి, వారు ఆత్మవిశ్వాసంతో తమ జీవితాలను కొనసాగించేలా చేయూతనివ్వడమే నా ప్రధాన లక్ష్యం. బాన్సువాడ నియోజకవర్గంలోని ప్రతి అర్హుడికీ సహాయం అందాలన్నదే నా సంకల్పం. ఈ సేవా కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములై, తమ గ్రామాల్లోని దివ్యాంగులను గుర్తించి సహకరించాలి. మన చిన్న ప్రయత్నం ఒకరి జీవితంలో గొప్ప మార్పును తీసుకురాగలదు. ఒక్కరు కూడా సహాయానికి దూరం కాకుండా మనమంతా కలిసి కృషి చేద్దాం” అని పిలుపునిచ్చారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ.





**మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన పద్మాదేవేందర్‌రెడ్డి.**

**తెలంగాణ భవన్‌లో బతుకమ్మ వేడుకలు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 (జన సంఘర్షణ)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ మహిళా నేతలు,మహిళలతో కలిసి వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి,అందంగా అలంకరించారు. అనంతరం బతుకమ్మలను ఒకచోట ఏర్పాటు చేసి,మహిళలతో కలిసి సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆడారు. మహిళలతో మమేకమై పండుగ సంబరాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, మహిళలంతా ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పండుగకు ప్రత్యేక విశిష్టత ఉందన్నారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రత్యేకతను చాటిచెబుతుందని తెలిపారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనూ బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషించిందని, తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పిందని పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న పండుగలు, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ, వాటి విశిష్టతను ప్రపంచానికి తెలియజేయాలని సూచించారు.బతుకమ్మ పండుగ మహిళల మధ్య ఆత్మీయతను, ఐకమత్యాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. మహిళలు సంతోషంగా, ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ప్రతి ఒక్కరూ సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ, పండుగ విశిష్టతను కాపాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆడిపాడారు.దీంతో తెలంగాణ భవన్‌లో పండుగ వాతావరణం నెలకొంది.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
అక్టోబర్ । ఆదివారం । 11 । 2026


# కొత్త జిల్లాలు.. అభివృద్ధి కేంద్రాలు !

**శాసనమండలి మాజీ సభ్యుడు షేరి సుభాష్ రెడ్డి.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 (జన సంఘర్షణ)**

ఒక దార్శనిక పాలకుడి ముందుచూపు ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది. తెలంగాణ రాష్ట్రం సాధించిన వెంటనే పది జిల్లాలను 33 జిల్లాలకు పెంచి, పాలనను వికేంద్రీకరించి, అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరువ చేసిన కేసీఆర్ నిర్ణయమే ఇందుకు నిదర్శనం. ఒకప్పుడు తమ జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 100 నుంచి 150 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన ప్రాంతాలు కూడా ఉండేవి. కలెక్టర్, ఎస్పీ, జిల్లా స్థాయి ఉన్నతాధికారి తన ఉద్యోగ కాలంలో కనీసం ఆ జిల్లాలోని కొన్ని మండల కేంద్రాలకు కూడా వెళ్లడం వీలయ్యేదికాదు.కానీ కొత్త జిల్లాల ఏర్పాటుతో ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జిల్లాల ఏర్పాటుతోపాటు ఉమ్మడి రాష్ట్రంలో 459 ఉన్న మండలాలకు గాను మరో 125 కొత్తగా ఏర్పాటు చేసి 584 చేశారు. 43 రెవెన్యూ డివిజన్లకు గాను 25 కొత్తగా ఏర్పాటు చేసి 74 చేశారు. పోలీస్ స్టేషన్లను 733 నుంచి 852కు పెంచారు. గ్రామ పంచాయతీలను 8,368 నుంచి 12,760కి పెంచారు. తండాలనుగ్రామపంచాయతీలుగా మార్చి, దశాబ్దాల గిరిజనుల కలను సాకారం చేశారు.కేసీఆర్ ప్రభుత్వం జిల్లాల ఏర్పాటుతో ఆగిపోలేదు. ప్రతి జిల్లాకూ ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్సెస్ (ఐడీవోసీ) అనే కొత్త కలెక్టరేట్ భవనాలు నిర్మించింది. వీటిలో కలెక్టర్, ఎస్పీ ఆఫీస్‌లు, అన్ని శాఖల కార్యాలయాలు ఒకే చోట ఉండేలా రూపొందించింది. 28 కొత్త ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్సులను 20 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు రూ.50 నుంచి రూ.70 కోట్ల వ్యయంతో చేపట్టారు. కేసీఆర్ స్వయంగా సిద్ధిపేట, కామారెడ్డి, వరంగల్, రాజన్న-సిరిసిల్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, జగిత్యాల, పెద్దపల్లి, నిజామాబాద్, జనగామ, నిర్మల్, నాగర్‌కర్నూల్, మంచిర్యాల, గద్వాల, మహబూబాబాద్ కాంప్లెక్స్ భవనాలను ప్రారంభించారు. మెదక్, నాగర్‌కర్నూలు, సూర్యాపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, కామారెడ్డిలో అత్యాధునిక ఎస్పీ కార్యాలయాలను ప్రారంభించారు. కామారెడ్డి ఎస్పీ కార్యాలయం 31 ఎకరాల్లో, సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ 29 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించడం విశేషం. వైద్యరంగంలోనూ కేసీఆర్ ప్రభుత్వం విశేష కృషి చేసింది. 33 జిల్లాలకు 33 మెడికల్, నర్సింగ్ కాలేజీలు నెలకొల్పింది. వాటికి అనుబంధంగా కొత్తగా 300 పడకల దవాఖానలు ఏర్పాటు చేసింది. రాష్ట్ర ఏర్పాటుకు ముందు తెలంగాణలో 5 మెడికల్ కాలేజీలు ఉంటే వాటిని 33కు పెంచడం విశేషం. వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లే సామాన్యులకు తమ జిల్లా కేంద్రాల్లోనే మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టింది. ఒకప్పుడు 2,850 మాత్రమే ఉన్న మెడికల్ సీట్లు కొత్త మెడికల్ కళాశాలల వల్ల ఎనిమిది వేల పైచిలుకు సీట్లకు పెరిగాయి.జిల్లాల ఏర్పాటుతో కేంద్ర ప్రభుత్వం జిల్లాకో నవోదయ విద్యాలయం, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. వాటితోపాటు కొత్తగా జాతీయ రహదారులు, రైలు మార్గాలు నిర్మించాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రతి జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి రెండు వరుసల రహదారులను కేసీఆర్ ప్రభుత్వం నిర్మించింది. రాష్ట్ర రాజధాని నుంచి జిల్లా కేంద్రాలకు రోడ్లు అభివృద్ధి చేశారు. దీంతో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడ్డాయి.కొత్త జిల్లాల ఏర్పాటు ముఖ్యంగా పాలనను ప్రజలకు దగ్గరగా తీసుకురావడం,అభివృద్ధిని వికేంద్రీకరించడం,వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం కోసం తీసుకున్న ముఖ్య నిర్ణయం.కొత్తగా వ్యవసాయ, మార్కెటింగ్ కార్యాలయాలు, వందలాది విద్యుత్తు సబ్‌స్టేషన్లు, పరిశ్రమలు, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో గణనీయ అభివృద్ధి కనిపించింది.



అనేక సవాళ్లను అధిగమించి కేసీఆర్ తెలంగాణను అగ్రస్థానంలో నిలబెట్టారు.కొత్త జిల్లాలు, మండలాలు, జిల్లా పరిషత్తులు, మున్సిపాలిటీల ఏర్పాటుతో అడ్మినిస్ట్రేటివ్ పోస్టులు పెరిగాయి. బీఆర్ఎస్ హయాంలో 2 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల సృష్టి జరిగింది. కొత్త జిల్లాల ఆధారంగా 7 జోన్లు, 2 మల్టీ జోన్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో 95 శాతం స్థానిక రిజర్వేషన్ అమలు చేశారు. ఇందుకోసం 2018లో ప్రెసిడెన్షియల్ ఆర్డర్ తీసుకువచ్చారు. ఇది స్థానిక యువతకు ఎక్కువ అవకాశాలు కల్పించింది. జిల్లా కేంద్రాలు అభివృద్ధి చెందడంతో వాణిజ్య కార్యకలాపాలు, నిర్మాణం, సర్వీసులు, చిన్న వ్యాపారాలు పెరిగాయి. మెడికల్ కాలేజీలు, దవాఖానలు స్థానికంగా ఉద్యోగాలు సృష్టించాయి. కొన్ని జిల్లాల్లో పరిశ్రమలు వచ్చి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరిగాయి. వాహనాలు, ఎలక్ట్రానిక్స్, ఇతర ఉత్పత్తుల షోరూమ్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లు, వ్యాపార సంస్థలు జిల్లా కేంద్రాలకు వచ్చాయి. జిల్లా కేంద్రాలు అభివృద్ధి కేంద్రాలుగా మారడంతో స్థానిక మార్కెట్ పెరిగింది.కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం నూతన రూపం దాల్చింది. పది జిల్లాలు 33గా వృద్ధి చెంది, ప్రజలకు పాలన, సేవలు చేరువ చేసింది. ప్రతి గ్రామానికీ అభివృద్ధి వెలుగులు ప్రసరించాయి. జిల్లాల ఏర్పాటు కేవలం పరిపాలన కాదు. ప్రజా హృదయాలకు అందించిన నిజమైన సేవ. పాలన దగ్గర అయినప్పుడు ప్రజల కష్టాలు దూరమవుతాయి. కేసీఆర్ చూపిన దారి జిల్లాల రూపంలో వికసించింది. ప్రతి ప్రాంతమూ తన గుర్తింపు పొందింది. ప్రతి జిల్లా తన అభివృద్ధి మార్గం కనుగొన్నది. ఇది కేవలం భౌగోళిక విభజన కాదు. తెలంగాణ ఆత్మకు కొత్త శక్తి ఇచ్చిన నిర్ణయం. జిల్లాల ఏర్పాటుతో కేసీఆర్ తెలంగాణ అభివృద్ధికి కొత్త వేగాన్ని అందించారు. ప్రజలకు పాలనను చేరువ చేయడమే నిజమైన అభివృద్ధి అని చాటి చెప్పారు.

# సర్ ప్రక్రియలో అవకతవకలు అక్రమ అరెస్ట్లను కండిస్తున్నాం.

